ఉద్వేగాలు

పాలగుమ్మి పద్మరాజు

ఉద్వేగాలు అంటే నాకు చాలా అసహ్యం. ఏమీ కారణంలేకపోయినా ఏడవగలగడం ఒక గొప్పతనమే మోగాని, సంఘ మర్యాదకీ, నాగరికతకీ తగినదిమాత్రం కాదు. పెద్దవాళ్లెవరేనా కంటనీరు పెట్టుకొని ఏడిచారంటే నాకు రోత. నాకేగాదు, నాగరికత అంటే తెలిసిన ప్రతివాడికీని. హరిశ్చంద్రనాటకంలో కూర్చుంటే వేషాలు వేసేవాళ్లు సరిగా ఏడవలేకపోయినా, మనకి అటూ ఇటూ కూర్చున్నవాళ్లు ముక్కులు చీదుకుంటూ, గొంతులు సవరించుకొంటూ కళ్ళనీళ్ళు తుడుచుకోవటం చూసినప్పుడల్లా 'అరెరే! ఏమిటీ మూఢత్వం?' అనుకుంటాను. పరామర్శకి వెళ్ళే పెద్దమనుష్యలంతా తేలికగా కళ్ళనీళ్ళు తెప్పించుకుని కష్టమంతా తమవయినట్టుగా ఘటించగలగడం చాలా కష్టమే మోగాని, అది సభ్యత ఎంతమాత్రం కాదని నా నిశ్చితాభిప్రాయం.

నాకు ముప్ఫయిఏళ్ళ క్రిందటి మాట జ్ఞాపకం వస్తోంది. మా చెల్లెల్ని అప్పుడు శేషి అనేవాళ్ళం. దానికి అయిదో ఏడు. నాకు తొమ్మిది. మా అమ్మమ్మగారింటి దగ్గర మా కిద్దరికీ బాగా అలవాటు. మా అమ్మ లేకపోయినా ఒకటి రెండు వారాలు మా అమ్మమ్మ దగ్గర శేషి ఉంటూఉండేది. మా అమ్మా నాన్నా కాశీరామేశ్వరాలు యాత్ర వెడుతూ, ఉండగలమనే ధైర్యం మీద శేషినీ, నన్నూ అమ్మమ్మగారింటి దగ్గర వదిలి వెళ్ళిపోయారు.

అప్పుడు మా శేషి చాలా చలాకీగా ఉండేది. అది అంటే అందరికీ ముద్దు. అంతా దాన్నే ఎత్తుకునేవారు. అంచేత నాకు కొంచెం ఈర్ష్యగా ఉండేది. దానిమీద నాకు అధికారం ఉందని నిరూపించుకోవడానికి అప్పుడప్పుడు కొంచెం కేకలు వేసేవాడిని. దానికి కోపం వస్తే, 'రాజిగాలి జత్తుందను' అనేది. నేను కొంతసేపు జవాబు చెప్పకుండా కూర్చుంటే దగ్గరగా వచ్చి, 'ఉంతానులే, నన్నెప్పులూ అల్లా అనకేం మరి?' అని సమాధానపడేది.

దాని మాటలు అందరికీ నవ్వువచ్చేవి. ఒకనాడు గదిలోకి ముందు మా అత్తయ్య వెళ్ళింది. తరువాతమామయ్యవెళ్లాడు.తలుపు దగ్గరగా వేసుకుంటున్నాడు. అప్పుడు మా అమ్మమ్మ పక్కనే పడుకున్న శేషి ముఖం అదో మోస్తరుగాపెట్టి అందిగదా, "ఛీ! అసయ్యమమ్మా! ఎవరన్నా గదులో తలుపేసుకు పరుకుంతారేంతి! ఛీ!" అని. మామయ్య వెంటనే తలుపుతెరిచి, పక పక నవ్వి, దాన్ని ఎత్తుకుని గదిలోకి వెళ్ళాడు మా అత్తయ్య దానికో పాట నేర్పింది.

'అలంకరించుకోవే కోడలా! అత్తవా రింటికి పోవాలి.'

అసలు పాట ముద్దుగా ఉన్నా లేకపోయినా మా చెల్లి భాషలో అది రూపాంతరం పొంది ఎంతో ముద్దుగా ఉండేది. మేము అమ్మమ్మగా రింటిదగ్గర ఉన్నప్పుడు పక్క ఇంట్లో ఒక అమ్మాయికి కార్యమయింది. మే మంతా భోజనానికి వెళ్ళాము. నాలుగో నాడు ఆ అమ్మాయి అత్తవా రింటికి వెళ్ళే నాడు మా వాళ్ళంతా చూడ్డానికి వెడుతూంటే నేనూ, శేషీకూడా వెళ్ళాము. ఆ అమ్మాయి ఒకగదిలో చీర కట్టుకుంటోంది. శేషి ఆడుతూ పాడుతూ అక్కడికి వెళ్ళి పాడింది:

'అలంకరించుకోవే కోడలా! అత్తవా రింటికి పోవాలి.'

ఆపాట అర్థం దానికసలు తెలియదు. కానీ పాపం ఆ అమ్మాయి కళ్ళనీరు పెట్టుకుంది.

ఎవరూ లేకుండా ఆడుకుంటున్నప్పుడల్లా ఈపాటే అది పాడుకుంటూ ఉండేది. గంతులువేస్తూ పువ్వులుకోసుకునేటప్పుడూ, మట్టితో ఇల్లు కట్టుకునేటప్పుడూ అదే పాట!

'అలంకరించుకోవే కోడలా! అత్తవా రింటికి పోవాలి.'

కాని చివరికి శేషి అత్తవా రింటికిపోయే నాటికి ఈ పాట దానికి జ్ఞాపకం లేదు.

శేషి అమ్మకోసం బెంగపెట్టుకున్నా అభిమానంచేత పైకి చెప్పేది కాదు. ఒకనాడు నేను అన్నాను 'శేషి అమ్మకోసం బెంగపెట్టుకుందోయ్' అని.

దానికి రోషం వచ్చింది. 'ఎదవా! నువ్వే బెంగత్తుకున్నావు' అని ఏడుపు మొదలుపెట్టింది. ఆనాడే మొదలు దానికి జ్వరం. అది ఓపిక ఉన్నంతవరకూ తిని, తిరగడం మాత్రం మానలేదు. ఆ రోజు నుంచి అది ఆట్టే ఎవరితోటీ మాట్లాడేది కాదు.

ఒకనాడది మట్టితో ఇల్లు కడుతూ తనలో తను అనుకుంటోంది, 'ఇదిఅమ్మకీ, ఇదినాకూ, ఇదినాన్నకీ, ఇది అన్నయ్యకీ, ఛీ! ఇది అన్నయ్యకిలేదు. నన్ను బెంగెత్తుకున్నా నన్నాడు, నేను బెంగెత్తుకున్నానేంతి?'

దాని కళ్ళలోకి ఏడుపు వచ్చేసింది. వెంటనే ఆ ఇల్లు కాలితో తన్నిపారేసి గొంతుఎత్తి పాడింది: 'అలంకరించుకోవే కోడలా! అత్తవారింటికి పోవాలి.'

కాని ఏడుపాగలేదు. కళ్ళు నులుపుకుంటూ వెనక్కి తిరిగితే నేను కనబడ్డాను. మళ్ళీ అభిమానపడి, 'అలంకరించుకోవే కోడలా...' శక్తికొలదీ గొంతుఎత్తి పాడింది.

'అన్నయ్యా! మనం మనూరెల్లిపోతాం. కదూ?'

'అమ్మా, నాన్నా వచ్చాకాను,' అన్నాను నేను.

'వచ్చేకేలే' అంది.

మరునాడు అది మంచం మీదనుంచి లేవలేదు. మా అమ్మమ్మ చాలా భయపడింది. నిద్రలో అప్పుడప్పుడూ పలవరింతలు. మా నాన్నకి తంతి ఇచ్చారు.

రెండురోజులు శేషి కళ్ళు విప్పలేదు. మూడవనాడు మధ్యాహ్నం కొంచెం తెలివి వచ్చి నాలుగు పక్కలా కలియచూసింది. తను అనుకున్నదేదో కనబడనట్టుగా ఊపిరి విడిచి మళ్ళీ పడుకుంది. మా అమ్మమ్మ దగ్గరగావెళ్ళి, 'ఎల్లా ఉందమా?' అంది.

"మాఊరే బాగుంతుంది మీ ఊర కంతే," అంది శేషి.

'అమ్మ వస్తుందీ, బెంగ పెట్టుకో తల్లీ! నీకు ఎంచక్కా ఎన్నో తెస్తా నాన్న. అన్నయ్యా కొక్కటీ ఇవ్వకేం?'

'మా అమ్మ వచ్చాకాను మా ఊరె పోతాంగాదూ?'

'అల్లాగేతల్లీ!'

'అన్నయ్యే బెంగెత్తుకున్నాలు. నే బెంగెత్తుకోలేదు.'

'అవునమ్మా! నువ్వు బంగారుతల్లివి.

ఇంతలో మా అమ్మ తలుపు తెరు కాని ఒక గాలివానలా వచ్చిపడింది. శే మా అమ్మ బుజంమీదికి ఒక్క ఎగు ఎగిరింది. ఇద్దరూ చాలాసేపు మాట్లా లేకుండా ఏడిచారు.

"నా తల్లి నొక్కత్తిని వదిలి వె పోయానమ్మా! నా తల్లివి,' అంది మ అమ్మ కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ.

శేషి వెక్కివెక్కి ఏడుస్తూ 'అన్నయ నన్ను బెంగెత్తుకున్నా వన్నాలు.' అంది.

'కాదదాంలే అమ్మా! అన్నయ్యని అని సముదాయించింది మా అమ్మ.

నాకు మా అమ్మమీద చాలా కోప వచ్చింది. మా శేషి ఏడిచిందంటే చిన్న పిల్ల, మా అమ్మ ఎందుకు ఏడవాలి అయినా నేనుమాత్రం బెంగెట్టుకోలేదూ

మా అమ్మ బుజ్జగించినప్పుడు నా ఏడుపు వచ్చింది! మా శేషి మాత్ర ఆనాడే సుఖంగా పాడింది, 'అలంకరిం కోవే కోడలా! అత్తవారింటికి పోవాలి.'

పెళ్ళి అయిన తరవాత మా శేషి శే అయింది. బావ అల్లాగే పిలిచేవాడు దాన్ని దాని అదృష్టం మంచి కుటుంబంలో పడడ కాదు, మంచి మొగుడుకూడా దొరికాడు.

మా బావ ఆవేళ ఇంగ్లాండు వెడతా బారిష్టరు పరీక్షకి. కాని బారిష్టరం అప్పటికి ఇప్పటికీ మా శేషుకి ఏమిటో తెలియదు. అదేదో ఉద్యోగ మనుకునేది.

నేనూ, మాబావా గదిలో కూర్చున్నామ

గబుక్కున తలుపు తోసుకుని 'నల్లవాడే, గొల్ల పిల్లవాడే' అంటూ పాడుకుంటూ వచ్చింది శేషు. బావ గదిలో ఉన్నట్టుగా అది ఎరగదు. అందువల్ల నాలిక కరుచుకుని పాట మానేసింది. మా బావ అన్నాడు.

'అబ్బా! ఎంత భయం నటిస్తున్నావు?'

'అయితే పోనీయండి మానివెయ్యనే మానివెయ్యను' మళ్ళీ పాడింది. 'నల్లవాడే గొల్ల పిల్లవాడే.'

బావ పకపక మని నవ్వాడు. అందుకు కారణం ఉందికూడా. బావ నల్లగా ఉంటాడు. నాకూ నవ్వువచ్చింది. శేషు సిగ్గువచ్చి మొహం తిప్పుకొని వెళ్ళి పోయింది.

మేం సావిడిలోనుంచి భోజనాలకి పోతూంటే ప్రక్కగదిలో మళ్ళీ అదేపాట. నెమ్మదిగా తనలో తను పాడుకొంటూంది. నేను తలుపు తొయ్యబొయ్యాను, కాని మా బావ నాచెయ్యిపట్టుకు ఆపి కొంతసేపు విన్నాడు.

భోజనాలయి అంతా సావిడిలో కూర్చున్నాము. బావ మంచంమీద వెల్లకిలా పడుకున్నాడు. మా అందరి ముఖాలుదీనంగా ఉన్నాయి. బావ ఆవేళ వెళ్ళిపోతాడు. మళ్ళీ ఎన్నాళ్ళకో!

ఒక కుర్చీలో బావకి కనబడకుండా కూర్చుని తమలపాకులకి ఈనెలు తీస్తోంది శేషు. పాడుకుంటోంది.

'నల్లవాడే గొల్ల పిల్లవాడే.'

బావ తదేకదీక్షతో వింటున్నాడు. కానీ తనపాట పాడుతున్నట్టుగా అది ఎరగదు. కళ్ళు దీనంగా ఆలోచిస్తున్నాయి. పెదవులు ఏడవడానికి సంకోచిస్తున్నాయి. ఊపిరితో ముక్కుకొంచెం అదురుతోంది.

ఇంతలో మా చిన్నతమ్ముడు అందుకున్నాడు. 'నల్లవాడే గొల్ల పిల్లవాడే.'

శేషుకి అప్పటికి తెలిసింది, తనపాట పాడుతున్నట్టుగా. వెంటనే ముఖంఎత్తి చూసింది ఎవరన్నా కనిపెడుతున్నారా అన్నట్టు. మా తమ్ముణ్ణి దగ్గరగా పిలిచి ప్రోత్సహించింది.

'పాడరా తమ్ముడూ.'

'నువ్వే పాడరాదూ!' సరదాగావుంటే. ఇందాకటినుంచీ పాడుతున్నావుగా—అన్నాడు బావ.

శేషు లేచి తమలపాకులు బావచేతికిచ్చి చిరునవ్వు నవ్వుకుంటూ వెళ్ళిపోయింది లోపలికి.

బావా, నేనూ, ఊళ్ళో చుట్టాలని చూడ్డానికి వెళ్ళి, మూడు గంటలకి యింటికి తిరిగి వచ్చాము. శేషుగొంతు గట్టిగా వినపడుతోంది. 'నల్లవాడే గొల్ల పిల్లవాడే.'

గొంతుక సాఫీగాలేదు. గట్టిగా పాడిన కొద్దీ జంకుతోంది. బావ గడిగుమ్మంలోకి వెళ్ళి నిలబడ్డాడు. ఆమె కళ్ళలో నీళ్ళు తుడుచుకోడానికి సావకాశం లేకపోయింది.

మా బావ ఎంతో సానుభూతితో చిరునవ్వు నవ్వబోతూ కొంతసేపు అల్లా నిలబడ్డాడు.

నేనూ, శేషూ, బావని సాగనంపడానికి స్టేషనికి వెళ్ళాము, రైలు రావడానికి ఇంకా పావుగంట వ్యవధి ఉంది. ఎవరమూ ఏమీ మాట్లాడకుండా నిలబడ్డాము.

బావే అన్నాడు చివరికి, 'నేను యింకో పావుగంటలో రైలులో ఉంటాను?'

'మీ తాళంచెవులో, పాపం?' అంది శేషు.

బావ జేబు తడుముకొని 'ఓహో! నువ్వుతీశావా? ఏమిటి?' అన్నాడు

'ఇదీ బాగానే ఉంది, నేనేం ఎరుగుదును?'

కానీ అదేతీసినట్టుగా చెప్పడంలో తెలిసిపోయింది. బావ రెట్టించి అడుగలేదు.

రైలువచ్చి ఆగింది. సామాను రైలులో ఎక్కింది. శేషుని చూస్తే నాకు గుండెలు దడ, దడా కొట్టుకున్నాయి. కొంచెం ముఖం క్రిందికి వంచింది. పెదవులు సగంవిప్పి ఉన్నాయి. వేలిగోటితో మునిపంటిని నొక్కుతూ నిలబడింది. కళ్ళలో నీటి బిందువులు ఇంక చెక్కులమీదికి జారడమే తరువాయి. వాటిని తుడుచుకుంటే, తను ఏడుస్తోన్నట్టు అందరికీ తెలిసిపోతుందని అల్లాగే నిలబడింది.

బావ దగ్గరగా వెళ్ళాడు. శేషు తలఎత్తలేదు.

'వెడుతున్నాను,' అన్నాడు,

శేషు తాళంచెవులగుత్తి బావచేతులో పెట్టింది. బావ ఆచేతిని తనచేతిలోకి తీసుకున్నాడు,

'ఛీ! ఏడవకు. ఎందుకేడుస్తావు?' అన్నాడు.

శేషు లేదన్నట్టుగా తల ఊపింది, కాని కన్నీటిని తుడుచుకోలేదు,

'ఇదుగో, ఇల్లాచూడు – నే వెళ్ళిరానా?'

శేషు సరేనన్నట్టు తల వూపింది. బావ శేషువీపుమీద ఒకసారి నిమిరి, ఒక నిట్టూర్పువిడిచి రైలు ఎక్కాడు.

ఇంక మా శేషుకి అభిమానమంతా పోయి, ముఖం ఎత్తి రైలువేపు చూస్తూ మనసారా ఏడ్చింది. ఎవరన్నా చూస్తే ఏమనుకుంటారు? నేను ఊరుకో పెట్టటానికి వీల్లేనిపరిస్థితి అది. అసలు అటువంటి పరిస్థితులంటేనే నాకు అసహ్యం. ముఖం చిట్లించి, మా శేషుని ఊరుకోబెట్టే బాధ్యత ప్రకృతికి వదిలేసి, ఇంకో ప్రక్కకు తిరిగి చూస్తూ నిలబడ్డాను,

* * *

శేషు తరవాత శేషప్ప అయింది. ఈలోగా చాలా మార్పులు జరిగాయి. శేషప్ప అదృష్టం తలక్రిందు లయింది. మా బావ చాలా చిన్నవయసులోనే పోయాడు. ఆమెకు ఒక ఆడపిల్ల. డబ్బుకి లోటులేదు, మా బావ అట్టే సంపాదించేదాకా బతక్కపోయినా అసలు వాళ్ళ స్థితిగతులు మంచివి. బావ పోయిన తరువాత శేషప్ప మాదగ్గరే ఉంటూవచ్చింది. మా మేనకోడలికి ఒక మంచి సంబంధం చూచి పెళ్ళి చేశాం. కుర్రవాడు బి. ఏ. ప్యాసయాడు, స్థితిగతులు చెప్పుకోతగ్గవి కాకపోయినా లోటులేని సందర్భం. కార్యంకూడా అయి

పోయింది. అతను బి. ఎల్. చదివే ఉద్దేశ్యంతో కాపరం మద్రాసులో పెట్టదలుచుకున్నాడు. ఇంకొక వారం రోజులికి అతను మద్రాసు వెడతాడనగా నేను స్వయంగా అతన్ని మా యింటికి తీసుకువచ్చాను.

మాఊరి వారందరికీ పదోసారి శేషప్ప తన అల్లుణ్ణి చూపించి అంటూ వచ్చింది, 'మా అల్లుడండీ. మద్రాసులో కల్క్రటీ చదవటానికి 'వెడుతున్నాడు' — బి. ఏ. అయిన తరవాత ఏది చదివినా కల్క్రటీ అనే దాని నమ్మకం. అల్లుడు తనలోతను నవ్వుకుని ఊరుకునేవాడు.

నేనుమాత్రం మందలిస్తూ అన్నాను. 'ఒసే.కల్క్రటీ ఏమిటీ– అదంత తేరగా ఉందనుకుంటున్నావా ?' అల్లుణ్ణి గురించి అంతా తెలిసిపోయేటట్టు గొప్ప చెప్పుకోవడం సభ్యతకాదని నా భయమేమో !

"ఆరి నీ యమ్మకడుపు బంగారంగానూ, మరి నా కా పరీక్షలు ఏవో తెలియవురా." మా శేషప్పమాత్రం పకపక నవ్వింది.

కూతుర్ని దగ్గరగా తీసుకొని బుజ్జగిస్తూ అంది, ''మా తల్లి ఏం కష్టపడుతుందో చెన్నపట్టణంలో ! మాటా తెలియదు మంతీ తెలియదు గావును.''

అల్లుడి ఎదుట కూతుర్ని అల్లా బుజ్జగించడం నాకు ఎందుకో నచ్చలేదు "మరేం ఫరవాలేదు. నీకు మల్లే వెర్రిబాగుల్దికాదు అది," అన్నాను.

'ఆరి నీయమ్మకడుపు బంగారంగానూ, దానికేం తెలుసురా పాపం!'

తను "పెద్దదనీ, పైకి ఏడవకూడదనే సంగతి దానికీ కొంతవరకూ తెలుసును. ఆదివారం రోజుల్లోను చాటుగా ఎన్నోసార్లు కళ్ళు తుడుచుకోడం నేను చూశాను, కాని అల్లుడుచూస్తే అమర్యాద అని నా అనుమానం. ఆమె ఏడుపు నటనకాదని నాకు తెలిసినానాగరికత వాంఛించే ఇతరుల ఎదుట అది వెకిలితనంగా నటనగాఅగుపడి పోతుందేమోనని నాభయం. శేషప్ప చివరదాకా తననికూడా అల్లుడు మద్రాసు రమ్మంటాడేమోనని మహా ఆశపడింది.

వెళ్ళేనాడు మేమంతా భోజనాలు అయాక సావిడిలో కూర్చున్నాము. అల్లుడు పత్రిక చదువుతున్నాడు కుర్చీలో కూర్చుని.

'ఏమోయి ! ఏవో రోడ్లమీద నడిచేబళ్లు ఉంటాయట గదూ ?' అంది అల్లుణ్ణి ఉద్దేశించి.

'ట్రాములాండీ ?' అన్నాడు.

'రోడ్డుమీదయితే ఎల్లా ఎక్కుతారవి ?'

'వెళ్ళి చూస్తేనేగాని అర్ధంకాదు' అన్నాను నేను.

'పోనీ నేనూ వెడతాను.' అల్లుడుమాత్రం వినబడనట్టు పత్రిక చదువుతున్నాడు.

అల్లుడికి వినబడకుండా నేను మందలించబోయాను.

'అటువంటి ఉద్దేశ్యాలు మనసులో ఉన్నా పైకి తేలిపోవడం మంచిదికాదు.'

'ఆరి నీయమ్మకడుపు బంగారంగానూ, ఇందులో తప్పేముందిరా ?'

— మా మేనకోడలు గదిలోకి రాబోయి, మొగుణ్ణిచూసి మళ్ళీ వెనక్కి వెళ్ళిపోబోయింది.

'రాఅమ్మా' ఇలావచ్చి కూర్చోవచ్చు,? అదివచ్చి శేషప్ప పక్కన కూర్చుంది.

'మాతల్లి ఈవేళ వెళ్ళిపోతుంది' ఒకసారి ముక్కు పైకి ఎగపీల్చుకుంది. కళ్ళలో నలకపడ్డట్టు నటించి కళ్ళు తుడుచుకుంది.

'మళ్ళీ శెలవుల్లో తప్పకుండా వచ్చెయ్యండోయ్.' అంది అల్లుణ్ణుద్దేశించి.

'అల్లాగేలెండి' అన్నాడు అల్లుడు పత్రిక చదువుతూనే.

శేషప్పకళ్లు ఈసారి నీళ్ళతో నిండిపోయాయి. మేము ఏమీ అనుకోకుండా ఉంటే భోరుమని ఏడిచేదే! అల్లుడి ముఖానికి పత్రిక అడ్డుఉంది. శేషప్పముఖం పక్కకి తిప్పుకుని కళ్ళు తుడుచుకుంది. 'పేపరు విశేషాలేమిటోయి ?' అంది. అనవసరపు ప్రశ్న !

కొంగు పరుచుకొని ప్రక్కకి తిరిగి పడుకొంది. ఈసారి అది ఎంత దాచుకోడానికి ప్రయత్నించినా దుఃఖం ఆగలేదు అల్లా పడుకుని ఉండగానే ఆమెకు ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు. నేను ఉన్నంతసేపూ అది ఏడుస్తూనే ఉందనుకున్నాను. రైలువేళదాకా అది అల్లాగే నిద్దరపోయింది.

నేను లేపాను. 'ఆరి నీ యమ్మకడుపు బంగారంగానూ' అంటూ కళ్ళు నులుపుకుంటూ లేచింది. రైలు వేళయిందని చెప్పాను. ఆమాట కొంతసేపటి వరకు దానికి అర్ధంకాలేదు.

బండి వచ్చింది. సామానంతా బండిలో పెట్టుకున్నాడు బండివాడు. అల్లుడు వెళ్ళి అవతల బండిదగ్గర నిలబడ్డాడు. మా మేనకోడలు అడుగులో అడుగు వేసుకుంటూ తల్లిదగ్గరకు వచ్చింది.

'అయ్యోతల్లీ; వెళ్ళిపోతున్నావా అమ్మా !'

శేషప్పబావురుమంది. అల్లుడు ఎదురుగా ఉన్నాడన్న సంగతి పూర్తిగా మరిచిపోయింది. వెక్కి వెక్కి చిన్న పిల్లలా ఏడిచింది. ఇంక రైలువేళ దాటిపోతుందని అల్లుడు తొందరపెట్టిన మీదట కూతుర్ని రైలులో ఎక్కనిచ్చింది. బండి వెళ్ళిపోయినా అది ఏడుపుమాత్రం మానలేదు

అయితే అప్పుడప్పుడు నాకో ప్రశ్న వస్తూ ఉంటుంది. మనసులో విచారాన్నంతనీ పయికి వదిలివేయడం తప్పా ? దానికి మనసులో ఒకటే సమాధానం. తప్పు కాకపోయినా సభ్యతకాదు. అయితే అటువంటి పరిస్థితుల్లో నేను ఏం చెయ్యాలి ? దానికిమాత్రం నా మనసులో సమాధానం లేదు.